క్లుప్తంగా

సెలవులకు ఊరు వెళితే సమాచారం ఇవ్వండి

తుని: విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇచ్చినందున ఎవరైనా ఊరు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తుని పట్టణ సీఐ.నాగ దుర్గారావు సూచించారు. ప్రస్తుత వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉందని, కటుంబ సభ్యులంతా ఇంటికి తాళాలు వేసి వెళ్లే ముందు పోలీసులకు నేరుగా లేక 100 నంబర్‌కు తెలియ పరచాలన్నారు. ఎవరైతే ఊరు వెళతారో ఆ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంసీ (లాక్డ్ హౌస్ మోనటరింగ్ కెమెరా) ఏర్పాటు చేస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు తాళం వేసిన ఇంటికి వస్తే ఎల్‌హెచ్‌ఎంసీ ద్వారా పోలీసు కంట్రోల్ రూంకు సమాచారం వస్తుందన్నారు. దీంతో సకాలంలో పోలీసులు అక్కడకు చేరుకుని ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తారని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనం, కాగితాలతో బొమ్మలు చేయడంలో మెళకువలు నేర్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దానాపల్లి శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం గెద్దానాపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, గిరిజనుల అభివృద్ధి కోసం ఆయన చేసిన ఉద్యమాలపై అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగి సురేష్ స్పోకెన్ ఇంగ్లిషు నేర్పారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

తుని రూరల్: హంసవరం శివారు జిల్లేడుపాడులో తాగునీటి పైపులైన్లకు పంచాయతీ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ మేరీఅవినాష్ తెలిపారు. పనులు పూర్తయ్యే వరకూ ప్రత్యామ్నాయంగా తాగునీరు అందిస్తున్నట్టు ఆమె చెప్పారు. పనులను పంచాయతీ కార్యదర్శి శంకర్ పర్యవేక్షిస్తున్నారు.

అవినీతిపై ఫిర్యాదు

జగ్గంపేట: అవినీతిని అడ్డుకోవాలంటూ శుక్రవారం బీజేపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో జరుగుతున్న అవినీతిని అడ్డుకోవాలంటూ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ (సాహితి వర్మ) ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాస్, ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సూరిబాబు, కిర్లంపూడి మండల అధ్యక్షుడు ఎడాలి రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 'ప్రజా చార్జిషీట్'

ప్రత్తిపాడు: బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద శుక్రవారం బీజేపీ నాయకులు ప్రజా చార్జిషీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, రోడ్లు, డ్రైన్ల దుస్థితి, మైనింగ్ జరిగే పనుల్లో అనుమతులు, పంచాయతీలకు కేంద్ర నిధులు వినియోగంపై తీర్మానాలు తదితర అంశాలపై తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్‌లకు అభియోగ పత్రాలు (చార్జి షీట్)లను అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు గున్నాబత్తుల రాజబాబు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కుండల సాయికుమార్ యాదవ్, అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు, మాజీ సైనికోద్యోగి కర్రి ధర్మరాజు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

ప్రత్తిపాడు: సారా కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే...పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన వేమగిరి సాయిబాబు మార్చి 14న ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగిన సారా కేసులో నిందితుడు. అప్పట్లో పోలీసుల కళ్లుగప్పి అతడు పరారయ్యాడు. నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, స్థానిక కోర్టులో హాజరు పరిచారు.

నర్సుల సేవలు అభినందనీయం

గండేపల్లి: నర్సుల సేవలు అభినందనీయమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సేవదళ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు నర్సులకు స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

- నిండుకుండలా తాండవ జలాశయం, చెరువులు
- జోరుగా వేసవి దుక్కులు
- ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్న అధికారులు


నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం


అల్లిపూడిలో వేసవి దుక్కు చేస్తున్న రైతు

కోటనందూరు: తాండవ జలాశయం, సాగునీటి చెరువుల్లో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉండడంతో ఈ ఏడాది కర్షకులు నిర్ణీత సమయం కంటే ముందుగానే ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. గతేడాది కురిసిన రెట్టింపు వర్షాలతో తాండవ జలాశయం నిండుకుండలా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు భూమిలో తేమ చేరడంతో పాటు చెరువుల్లో నీరు చేరింది. ప్రస్తుతం అన్నదాతలు జోరుగా వేసవి దుక్కులు చేస్తున్నారు. పశువుల పెంట వేసి పొలాలను సారవంతంగా మారుస్తున్నారు. తొలకరి పలకరించగానే నారుమడులు తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోపక్క ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేసేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

38,555 ఎకరాల్లో..

ఈ ఏడాది తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 38,555 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. తాండవ జలాశయం మొత్తం ఆయకట్టు 51,465 ఎకరాలు కాగా అనకాపల్లి జిల్లాలో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 18,776 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది తొలకరి వర్షాలతో సంబంధం లేకుండా ఖరీఫ్‌కు సాగునీరు అందే పరిస్థితులు పుష్కలంగా ఉన్నాయి.

373.6 అడుగుల నీటిమట్టం

తాండవ జలాశయం గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 373.6 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. గత రెండు దశాబ్దాల్లో ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఆగస్టు తరువాతే విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది గతానికి భిన్నంగా జూన్ నెలలోనే నీటిని విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా మార్గనిర్దేశకాలు ఇచ్చినట్లు తాండవ అధికారులు చెబుతున్నారు. మండలంలోని 40 సాగునీటి చెరువులు ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో కొంతమేర నీరు చేరింది.

ఉత్సాహంగా దుక్కులు

ఇటీవల కురిసిన వర్షాలకు పంటపొలాలు తేమ బారడంతో రైతులు జోరుగా వేసవి దుక్కులు చేస్తున్నారు. పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండడం, ఈ ఏడాది ముందుగానే తొలకరి పలకరిస్తుందనే ఊహాగానాలతో అన్నదాత ఉత్సాహంతో ఉరకలేస్తున్నాడు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలాలను మరోమారు దుక్కు చేసి నాట్లు వేస్తామని రైతులు చెబుతున్నారు.

విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు

రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మపోషకాల పంపిణీకి వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలకరికి ముందే అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పొలాలకు అందని సాగునీరు

తాండవ కుడి కాలువపై చమ్మచింత వద్ద నీటిని ఎత్తిపోసేందుకు దోని నిర్మించారు. ఈ ప్రాంతంలో కాలువ రెండుగా విడిపోయి ఒకటి అనకాపల్లి జిల్లాకు రెండోది కాకినాడ జిల్లాలో కోటనందూరు, రౌతులపూడి మండలాలకు వస్తుంది. దోని ప్రాంతంలో భారీగా పూడిక చేరడం వల్ల రెండు మండలాలకు నీరు అందడం లేదు. గత రెండు సంవత్సరాలుగా వరిపంట పక్వానికి చేరిన సమయంలో కేఈ చిన్నయ్యాపాలెం, తిమ్మరాజుపేట, కేఎస్ కొత్తూరు, పాతకొట్టాం తదితర గ్రామాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి.

సమస్యలు పరిష్కరించాలి



తాండవ కుడి కాలువపై చమ్మచింత వద్ద నిర్మించిన దోని ప్రాంతంలో పూడిక తొలగించకపోవడం వల్ల సుమారు 10 గ్రామాల్లో సాగునీటి సమస్య తలెత్తింది. రెండేళ్లగా సమస్యను పరిష్కరించాలని తాండవ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. సాగునీటి పంపిణీలో ఉన్న సమస్యలను అధికారులు పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలి.

– కరక అప్పలనాయుడు, తాండవ ఆయకట్టు రైతు, కేఈ చిన్నయ్యపాలెం

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి



రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఖరీఫ్ సమయంలో గ్రామాల్లో ఉండే వ్యవసాయ సిబ్బంది సేవలను రైతులు వినియోగించుకోవాలి. ఖరీఫ్ ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసాం.

– కె.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి చర్యలు


తునిలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న నాగమణి

తుని: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందించేందుకు చర్యలు తీసుకున్నామని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలికులు జి.నాగమణి తెలిపారు. తుని పట్టణం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు టెస్ట్‌బుక్స్, షూ, డిక్షనరీలు తదితర వాటిని తనిఖీ చేశారు. మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన కిట్లు, ఇంకా రావాల్సిన వస్తువుల సంఖ్యను ఎంఈవో పరవాడ గీతాదేవిని అడిగి తెలుసుకున్నారు. సరఫరా చేసే వస్తువులు, నాణ్యత, శాంపిల్స్‌ను సరిపోల్చి ఎటువంటి తేడాలు ఉన్నా రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం వస్తువులను భద్రపరిచి, పాఠశాలలకు చేరే వరకూ పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పది తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను ఆమె అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం నూకరత్నం, సీఆర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ యూనిట్ల ప్రారంభం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం, బెండపూడి గ్రామాల్లో శుక్రవారం మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ యూనిట్లు ప్రారంభమయ్యాయి. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర స్కీమ్ ద్వారా ప్రభుత్వం మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ యూనిట్లను ఏర్పాటు చేయగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన చేపల ఉత్పత్తులను అందించేందుకు ప్రభుత్వం ఈ యూనిట్లను ఏర్పాటు చేసిందని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. త్వరలో మరిన్ని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీర వెంకట సత్యనారాయణ(పెద్దబ్బు), వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ, ఎంపీటీసీలు గొంతెన దుర్గనాగేశ్వరరావు, యాదాల కొండబాబు, యాదాల కృష్ణ, గంగిరి అడివియ్య తదితరులు పాల్గొన్నారు.


పెరుమాళ్లపురంలో మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

తుని: పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 25వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం కౌన్సిలర్ కాసే సుమతితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుని: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుజాత శుక్రవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. కళాశాలలో జనరల్, ఒకేషనల్ కోర్సులు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. జనరల్ కేటగిరిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్‌లో ఎంఎల్టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, బీఎస్ఎఫ్, బీఆర్ఎం, సీఎస్ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 25 నుంచి అడ్మిషన్లు, జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.


ప్రిన్సిపాల్ సుజాత

పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పూర్తి వివరాలతో కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

పట్టణ టాపర్లుగా బాలికల కళాశాల విద్యార్థినులు

ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థినులు పట్టణ టాపర్లగా నిలిచారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. పట్టణ పరిధిలోని అన్ని కళాశాలల కంటే తమ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జె.లక్ష్మి 933/1000, బైపీసీలో కె.దివ్య 931/1000 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీలో వి.అక్షిత 437/470, కె.వెన్నెల 431/470 మార్కులు సాధించారని వివరించారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝ్జుల అవధాని, వడలి నర్సింహమూర్తి, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 22 జంటలు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నాయి.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, కొండ దిగువన తొలిపావంచ వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవార్లకు రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఉపాధి హామీ పనుల తనిఖీ

తుని రూరల్: వలసలను నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్ సూచించారు. చేపూరు చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులు, కూలీల మస్టర్ రోల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు సొంత ఊర్లలోనే ఉపాధి కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం గరిష్టంగా రోజుకూలి రూ.272 నిర్ణయించిందన్నారు. ఆ మొత్తాన్ని పొందేందుకు కూలీలు అప్పగించిన కొలతల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున కూలీలు వడగాడ్పులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


చేపూరులో ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్

ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలందరికీ వందరోజులు పని కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రతి కూలీకి సరాసరి రూ.272 వేతనం వచ్చేలా పనిచేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఉపాధి కూలీలు తమ జాబ్ కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మారిశెట్టి రమణ, టెక్నికల్ అసిస్టెంట్స్ చెన్నారెడ్డి, వి.మహేంద్రరావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ బి.చిరంజీవిరావు పరిశీలించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


హంసవరంలో నిల్వ నీటిని తొలగిస్తున్న జిల్లా ఎస్‌యూఓ మధు, ఆరోగ్య సిబ్బంది

తుని రూరల్: పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చని, ప్రజలు ఆరోగ్యవంతమైన జీవన ప్రమాణాలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ మధు పేర్కొన్నారు. మండలంలోని హంసవరంలో శుక్రవారం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ మధు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోగాలకు మూలం అపరిశుభ్రత అన్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రాయి దాసు, కార్యదర్శి ఇ.శంకర్, ఏఎన్ఎం కె.సునీత పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన

గోకవరం: పర్యావరణహిత జీవనశైలిని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని మల్లవరం సెక్షన్ అధికారి పి.వెంకట్రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో పర్యావరణహిత జీవనశైలిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని రైతులు, వ్యవసాయ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. నీటి వృథాకు అడ్డుకట్టవేయాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూదికొండ బీటు అధికారి డి.కామేశ్వరరావు, మల్లవరం బీటు అధికారులు వై.ఝాన్సీరాణి, టి.రాజా రమేష్, రైతులు పాల్గొన్నారు.


కామరాజుపేటలో రైతులు, వ్యవసాయ కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

యువకుడి మృతిపై కేసు నమోదు

కిర్లంపూడి: రాజుపాలెం సమీపంలో గురువారం పిడుగుపడి సామర్లకోటకు చెందిన ప్రకృతి శ్రీనివాస్(22) మృతి చెందాడు. దీనిపై శుక్రవారం మృతుడి తండ్రి ప్రకృతి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

డ్రైన్లలోకి వర్షపు నీరు పోయేలా చర్యలు

సాక్షి ఇంపాక్ట్

ఏలేశ్వరం: పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా నిర్మించిన డ్రైన్లల్లోకి వర్షపునీరు పోయేలా శుక్రవారం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 11న 'సాక్షి'లో అసంపూర్తిగా పనులు– ప్రజలకు అవస్థలు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కొండలరావు ఆధ్వర్యంలో డ్రైన్లల్లోకి వర్షపు నీరు పోయేలా పనులు చేపట్టారు. డ్రైన్లలకు రహదారులకు మధ్యలో ఉన్న మట్టిని జేసీబీతో తొలగించారు. తాత్కాలిక పనులు కాకుండా పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఏఈ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.


డ్రైన్ల వద్ద మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కొండలరావు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రైతులకు మేలు చేసేందుకు ఆర్బీకేలను ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, రైతులు ఆయనకు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొన్నాలు, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, వడ్డి శ్రీవాస్తవ, పలువురు రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

కోటనందూరు: రైతుల అవసరానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి అన్ని ఆర్బీకేల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు అధ్యక్షతన ఏఏబీ మండలస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి ఈ నెలాఖరుకు విత్తనాలు రప్పించేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎరువులు, పురుగుమందుల విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక రచించాలన్నారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాండవలో గరిష్టస్థాయిలో నీటి నిల్వలు ఉన్నందున రైతులు ముందస్తు ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు సుర్ల రాంబాబు, గర్సింగు శివలక్ష్మి, కుంచే సత్యవతి, జిగటాల వీరబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఏఈఓ కేవీ శివకుమారి, వీపీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి


కోటనందూరులో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

సిబ్బంది అందుబాటులో ఉండాలి

గోకవరం: రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బద్దిరెడ్డి నాగ వెంకటేశ్వరరావు సూచించారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్వరి, ఇతర వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు

జగ్గంపేట: మండలంలోని రాజపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని నంగన అక్షయ పదో తరగతి పరీక్షల్లో 585 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు అక్షయను శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అభినందించారు. మండలంలో 500 మార్కులు దాటిన ఆరుగురు విద్యార్థులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, సర్పంచ్ బి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి బస్సు సర్వీసు నడపాలని వినతి

గోకవరం: రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని వెదురుపాకకు చెందిన ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడి నుంచి విమానాశ్రయానికి నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారని, అక్కడి నుంచి ప్రైవేటు రవాణా మినహా ఇతర వసతి లేదన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించి విమానాలు వచ్చే సమయంలో విమానాశ్రయానికి బస్సు సర్వీసులు నడపాలని విజ్ఞప్తి చేశారు.


ఆర్టీసీ డీఎం రామన్నకు వినతి పత్రం అందజేస్తున్న రైతు అప్పలస్వామి